క్లుప్తంగా

28న మున్సిపల్ సమావేశం

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 28వ తేదీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చైర్మన్ చల్లా అంకులు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమిషనర్ ఫజులుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలను సమావేశంలో ఆమోదించనున్నట్లు చెప్పారు. ప్రతిపాదనలు సిద్ధం చేసిన పనుల్లో 3వ సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే నిధులు రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు, 4వ వార్డులో రూ.5.40 లక్షలతో సిమెంట్ రోడ్డు, అర్బన్ పరిధిలోని జగనన్న కాలనీలో వీధి దీపాలకు మీటర్లు, 1, 2 ,3, 5, 6, 7, 8 సచివాలయాలలో కాలువల్లోని మురుగునీరు తొలగించుటకు రూ.3 లక్షల కేటాయింపు, డంపింగ్ యార్డు మరమ్మతులు, పత్రికా ప్రకటనలకు బిల్లులు చెల్లించుట వంటి అంశాలు ఉన్నట్లు వివరించారు. కౌన్సిలర్లు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

మహిళలకు నెల రోజులు ఉచిత ఓపీ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాస్ వైద్యులు

ఒంగోలు అర్బన్: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మహిళలకు ఉచిత ఓపీ కల్పించడంతో పాటు అవసరమైన వైద్యం చౌకగా అందిస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో మహిళల వైద్యం కోసం రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి 27వ తేదీ వరకు నెలరోజుల పాటు ఈ అవకాశం కల్పిస్తామన్నారు. వైద్య పరీక్షలపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోత్స్న, ఇతర డాక్టర్లు ఉమాపతి, అనిల్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేక తప్పిపోయిన వ్యక్తి


తప్పిపోయిన ధరావత్ భాష్య

మద్దిపాడు: మండలంలోని బూరేపల్లి కాలనీలో నివాసం ఉంటూ మతి స్థిమితం కోల్పోయి కనిపించకుండా పోయిన ధరావత్ భాష్య ఎవరికైనా కనిపిస్తే మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్సై శ్రీరామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తాళ్లపాటి తండాకు చెందిన సుగాలీ వ్యక్తి ధరావత్ భాష్య తన కుమారుడు, భార్యతో కలిసి కొంత కాలంగా గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో పనిచేసుకుంటూ బూరేపల్లి పునరావాసకాలనీలో నివాసం ఉంటున్నాడని వివరించారు. ఈ క్రమంలో అతనికి మతిస్థిమితం లేక ఈ నెల 19వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆయన కుమారుడు సురేష్‌నాయక్ బంధువులను విచారిస్తున్నట్లు చెప్పారు. మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాగుంట కుటుంబం ఏ తప్పూ చేయలేదు

● కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి

ఒంగోలు సబర్బన్: మాగుంట కుటుంబం ఎటువంటి తప్పూ చేయలేదని.. వారి సంపాదనలో కొంత భాగం ఎన్నో మంచి పనులకు, ధార్మిక సంస్థలకు వెచ్చించారని తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాగుంట రాఘవరెడ్డి అరెస్టును ఖండించారు. 40 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతూ, పది రాష్ట్రాల్లో వ్యాపారాలు కొనసాగిస్తున్నా ఎటువంటి మచ్చ లేకుండా నిజాయితీగా వ్యవహరించారన్నారు. ఇది ఒక రాజకీయ కక్షసాధింపు చర్య అన్నారు. మాగుంట రాఘవ రెడ్డి న్యాయ పోరాటంలో విజయం సాధించి కడిగిన ముత్యంగా కేస్ నుంచి బయటపడడం ఖాయమని అన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

● వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
● జగనన్న ఫౌండేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


జగనన్న ఫౌండేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: జగనన్న ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం స్థానిక జయప్రకాష్ కాలనీలో జగనన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వారా వీర్రాజు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బాలినేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జగనన్న ఫౌండేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ వారా వీర్రాజు ఒక ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ అనంతరం వైఎస్సార్ సీపీలో చేరడమే కాకుండా జగనన్న ఫౌండేషన్ పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఎంత ఉన్నా కొంత పంచుదామన్న ఆలోచన సమాజానికి స్ఫూర్తినిస్తుందన్నారు. అందుకు మనస్ఫూర్తిగా వీర్రాజును అభినందిస్తున్నట్లు తెలిపారు. కొంతమంది తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారంటూ టీడీపీ నేతలపై ధ్వజమెత్తారు. నగరంలో ఉన్న ఏ శివారు కాలనీ చూసినా పట్టాలు ఎవరిచ్చారంటే తన పేరే చెబుతారన్నారు. కానీ, కనీసం ఒక్క పేదవానికి కూడా పట్టా ఇవ్వకుండా నగరం నడిబొడ్డులో రోడ్డు మీద రోడ్డు వేసి అభివృద్ధి అంటూ టీడీపీ నేతల వలే గొప్పలు చెప్పుకోవడం తనకు చేతకాదన్నారు. శివారు కాలనీల అభివృద్ధే లక్ష్యంగా నేడు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వెంకటేశ్వరకాలనీ, జయప్రకాష్ కాలనీ, రాజీవ్‌కాలనీ, ఇందిరమ్మకాలనీ, ప్రగతికాలనీ, బలరాం కాలనీ, కేశవరాజుకుంట, చినమల్లేశ్వరకాలనీ ఇలా అనేక కాలనీల్లో పేదలకు నివాస స్థలాలు పంపిణీ చేశామన్నారు. తాజాగా కొప్పోలు సమీపంలో 300 ఎకరాలు, వెంగముక్కలపాలెం సమీపంలో 200 ఎకరాలను రూ.500 కోట్లకు కొనుగోలు చేస్తున్నామన్నారు. వీటిలో 25 వేల మంది ఇళ్లు లేని పేదవారికి పట్టాలు పంపిణీ చేయడంతో పాటు ఇళ్లు కూడా కట్టించి ఇస్తామన్నారు.

మార్చిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాల పంపిణీ...

మార్చి నెలలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒంగోలు వస్తారని, ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని బాలినేని పేర్కొన్నారు. ఒంగోలు నగరంలో గుడిసె అనేదే ఉండరాదని, ప్రతిఒక్కరికి పక్కా ఇళ్లు ఉండాలనేదే తన లక్ష్యమని అన్నారు. తాను గడపగడపకు తిరుగుతుంటే మహిళలు తాగునీటిని పగటిపూట ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే రూ.339 కోట్లు మంజూరు చేయించడం జరిగిందని బాలినేని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఇళ్ల పట్టాలు కూడా మహిళల పేరుమీదనే మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ పథకాన్ని ప్రారంభించినా అది మహిళల పేరు మీదనే ఉంటుందని, మహిళలను తోబుట్టువులుగా ఆయన భావిస్తారని బాలినేని అన్నారు. అటువంటి అన్న, తమ్ముడు మీ ముఖ్యమంత్రిగా ఉన్నందుకు గర్వపడాలని, తప్పకుండా ప్రతి పేద కుటుంబం సగర్వంగా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు ఉపయోగపడతాయని, ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలని బాలినేని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ పరిశీలకుడు ఆదినారాయణరావు, జగనన్న సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, రాష్ట్ర కో ఆర్డినేటర్ శివకుమార్‌రెడ్డి, స్థానిక డివిజన్ అధ్యక్షుడు సురేష్, సువర్ణ, జ్యోతి, జిల్లెలమూడి రమాదేవి, లీలాకుమారి, శంకరరెడ్డి, మల్లీశ్వరి, పాలపర్తి సుబ్బారావు, మరియమ్మ, ఎం.శ్రీనివాసరావు, అజయ్‌బాబు, ఆర్.అశోక్‌చంద్ర, కొండలు, మంజుల, రమాదేవి, మణికంఠ, అమర్‌నాథ్‌రెడ్డి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఒంగోలులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీ చంద్రశేఖరరెడ్డి వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేస్తున్నట్లు తెలిపారు. అధికారం చేపట్టిన నాలుగేళ్లలో ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటర్లు తమ అమూల్యమైన ఓటును వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు వేయాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో, ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం మూడున్నరేళ్లుగా చేస్తున్న కృషి ఉపాధ్యాయులందరికీ తెలిసిందేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల గళాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, పీ చంద్రశేఖరరెడ్డి చురుకైన పాత్ర పోషిస్తారని టీజేఆర్ భరోసా ఇచ్చారు.

కోటంరెడ్డి, రఘురామపై మండిపడిన ఎమ్మెల్యే టీజేఆర్...

ముందు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి అప్పుడు మీడియా ముందుకొచ్చి మాట్లాడాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు సవాల్ విసిరారు. నరసాపురం నియోజకవర్గంలో అడుగుపెడితే అక్కడి ప్రజలు చెప్పుతో కొడతారంటూ ఎంపీ రఘురామకృష్ణంరాజుపై కూడా ఎమ్మెల్యే తీవ్ర పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనే మూడు అక్షరాల పదవి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని గుర్తుంచుకోవాలంటూ కోటంరెడ్డిని ఉద్దేశించి కిరికిరిరెడ్డి అంటూ వ్యంగ్యంగా ఎమ్మెల్యే టీజేఆర్ ధ్వజమెత్తారు.

నాగులుప్పలపాడు మండలంలో ఎమ్మెల్యే సమావేశం...

నాగులుప్పలపాడు: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులైన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు నాగులుప్పలపాడు మండలం నుంచి అత్యధిక ఓట్లు వేసేలా కృషి చేయాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల కోసం గ్రామస్థాయిలో సమన్వయం చేయడానికి శనివారం మండలంలోని చేకూరపాడు, మద్దిరాలపాడు, అమ్మనబ్రోలు, అగ్రహారం, చదలవాడ గ్రామాల్లో నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. నాయకులతో మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఎన్ని ఓట్లు ఉన్నాయి.. పార్టీకి అనుకూలమైన ఓట్లు ఎన్ని..? అవన్నీ వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు పడేలా సమన్వయంతో పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయా గ్రామాల నాయకులు ఎమ్మెల్యే సుధాకర్ బాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, కూనం పూర్ణచంద్రరావు, కొలకలూరి విజయ్‌కుమార్, దశరథ, కుమ్మారి సుధాకర్, కోయి హనుమయ్య, బత్తుల కొండయ్య, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బాలినేని, జంకెను సత్కరించిన గొంగటి


బాలినేనిని సత్కరిస్తున్న గొంగటి శ్రీకాంత్‌రెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి శనివారం కలుసుకుని సత్కరించారు. దర్శి నియోజకవర్గం దొనకొండ మండలం రామాపురంకు చెందిన శ్రీకాంత్‌రెడ్డిని తాజాగా జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన సంగతి విధితమే. ఈ సందర్భంగా శనివారం ఉదయం బాలినేనిని ఆయన నివాసంలో, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకరెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో కలుసుకుని సత్కరించారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు సంతోషిస్తున్నానని, తప్పకుండా 2024లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా యువతలో ఉత్సాహాన్ని తీసుకువస్తానని అన్నారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

● ఒంగోలు ఎంపీపీ మల్లికార్జునరెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, పక్కన ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: మండల, గ్రామ అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి కోరారు. ఒంగోలులోని మండల పరిషత్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశానికి ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి కన్వీనర్‌గా వ్యవహరించగా తొలుత ఎంపీపీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని అధికారులను కోరారు. అందుకోసం సచివాలయ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, వలంటీర్లు అందజేసిన సర్వేలను పూర్తిచేయాలని కోరారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ఈ క్రమంలోనే తమ శాఖ రిజిష్టర్లు పక్కాగా అప్ టూ డేట్ చేస్తూ ఉండాలని సూచించారు. ముందస్తు సెలవు లేకుండా ఎవరూ గైర్హాజరు కారాదన్నారు. వచ్చే ఉగాది నాటికి ఎట్టి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న జగనన్న కాలనీలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, విద్యుత్ ఏఈ ఆర్ఆర్ చెన్నారెడ్డి, ఏపీవో రామరాజు, హార్టీకల్చర్ అధికారి ప్రత్యూషా, డాక్టర్ సుందర్‌ప్రసాద్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆశా, ఆయుష్ డాక్టర్ శివయ్య, ఒంగోలు మండల వ్యవసాయ అధికారి జి.కిషోర్‌బాబు, ఎంఈవో కిషోర్‌బాబు, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు, ఆర్టీసీ అధికారి ఆచార్యులు, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, సోషల్ వెల్ఫేర్ అధికారి శ్రీలత పాల్గొని వారి శాఖల అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. జెడ్పీటీసీ, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు


హేమసాయిరెడ్డి (ఫైల్)

ఒంగోలు టౌన్: ఐదు నిమిషాల్లో వస్తానని చెప్పి వెళ్లిన ఆ యువకుడు తిరిగి రాలేదు. తన కుమారుడి ఆచూకీ తెలపమంటూ అతని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ వివరాలిలా ఉన్నాయి. దర్శికి చెందిన కల్లీ సుబ్బారెడ్డి ఫర్టిలైజర్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీ ఇంటర్మీడియట్ చదువుతున్న తన కుమారుడు హేమసాయిరెడ్డితో కలిసి కంపెనీ పనుల నిమిత్తం ఒంగోలు వచ్చాడు. పనులు పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద సుబ్బారెడ్డిని దింపి ఇక్కడే ఉండు.. ౦5 నిముషాల్లో వస్తానంటూ హేమసాయిరెడ్డి వెళ్లాడు. ఎంతసేపైనా తిరిగి రాలేదు. దాంతో ఆందోళనకు గురైన సుబ్బారెడ్డి గాలించినా ప్రయోజనం లేకపోవడంతో దర్శి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి కొడుకు ఆచూకీ కోసం ఎంత వెదికినా కనిపించలేదు. చివరకు శనివారం ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రైవేటు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఒంగోలు టౌన్: ప్రైవేటు కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తూర్పురాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కుట్టుబోయిన బ్రహ్మానందం కోరారు. శనివారం స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కమ్మ మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

పేస్‌కు కంప్యూటర్ సైన్స్ పరిశోధనా కేంద్రం

ఒంగోలు టౌన్: పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగానికి పరిశోధనా కేంద్రాన్ని జేఎన్‌టీయూ కాకినాడ మంజూరు చేసినట్లు కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశోధనా కేంద్రం ద్వారా అధ్యాపకులు, విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవచ్చని అన్నారు. పరిశోధనలకు అవసరమైన అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేయడం వలన జేఎన్‌టీయూ కళాశాలలోని సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్‌ను రీసెర్చ్ సెంటర్‌గా గుర్తించడం జరిగిందన్నారు. పేస్ కాలేజీకి పరిశోధనా కేంద్రాన్ని మంజూరు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ డా.అనిల్ కుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా.దారా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు

పొదిలి: పొదిలి కొండ శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి ఒకటో తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని ధర్మకర్తల మండలి చైర్మన్ కుప్పం కొల్లారావు, కార్యనిర్వహణాధికారి బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 1న అంకురార్పణ, 2న శేషవాహనం, 3న హంస వాహనం, 4న సింహ వాహనం, 5న హనుమంత వాహనం, 6న గరుడోత్సవం, 7న కల్యాణ ఉత్సవాలు, 8న రథోత్సవం, 9న అశ్వవాహనం, 10న పూర్ణాహుతి, 11న ఏకాంత సేవ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఆయా రోజుల్లో ఉభయదాతలు ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాదాల పంపిణీ ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి


జాతీయ రహదారిపై డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్న ఎస్సై హరిబాబు

నాగులుప్పలపాడు: 216వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు దాతల సహకారంతో కృషి చేస్తున్నట్లు నాగులుప్పలపాడు ఎస్సై హరిబాబు తెలిపారు. ఉప్పుగుండూరు సమీపంలోని మాచవరం, పెదగంజాం ప్రాంతాల్లో దాతల సహకారంతో ఇసుకతో నింపిన డ్రమ్ములను శనివారం ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతాల్లో జరిగిన అనేక ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని నష్ట నివారణకు చర్యలు చేపట్టే క్రమంలో సామాజిక కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్ సహకారంతో ఇక్కడ వేగ నియంత్రణకు డ్రమ్ములు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వాహనదారులు కూడా తగిన జాగ్రత్తలు పాటించి ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత ఆమలక లక్ష్మీనారాయణ దేవాలయంలో 60వ సప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, 9 గంటలకు ధ్వజారోహణం నిర్వహించి గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం సప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణ కల్యాణం శాస్త్రోక్తంగా అర్చకులు రఘునాథాచార్యుల బృందం ఘనంగా నిర్వహించింది. భక్తులకు అన్నప్రసాదం డాక్టర్ దుగ్గెంపుడి కృష్ణారెడ్డి, గోళ్ల వాసుదేవరావు, ఏర్వ నారాయణరెడ్డిలు పంపిణీ చేశారు. భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డీపీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.చెంచయ్య, కోశాధికారి వై.వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు, మహిళ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై సమీక్ష

పొదిలి: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రచారంపై సమీక్ష సమావేశం శనివారం జరిగింది. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమీక్ష జరిగింది. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, ఎస్.రవి, పొదిలి డివిజన్ యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక, పెన్షనర్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చూడండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయ

చీమకుర్తి: రానున్న వేసవి కాలంలో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని సంతనూతలపాడు ఎంపీపీ బీ విజయ మండల పరిధిలోని అధికారులకు సూచించారు. శనివారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. గ్రామాల్లోని కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేసి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఉపాధి కూలీలకు వారు చేసిన పనుల్లో సక్రమమైన కొలతలిచ్చి ప్రతి ఒక్కరికీ 100 రోజుల పనిదినాలు కల్పించే విధంగా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్ర, ఏవో ప్రసాద్, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సేవాభావం అలవరచుకోవాలి


నిత్యావసరాలు అందిస్తున్న శ్రీనివాసరావు, ప్రశాంత్

ఒంగోలు: సేవా కార్యక్రమాలపై ప్రతిఒక్కరూ మక్కువ పెంచుకోవాలని ఏపీఆర్ఎస్ఏ ఒంగోలు కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు ఊతకోలు శ్రీనివాసరావు కోరారు. దివంగత ఏలం భాగ్యలక్ష్మి 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుమారుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో స్థానిక సీతారామపురంలోని సమతా మహిళా వేదిక వృద్ధాశ్రమ నిర్వాహకులకు నిత్యావసరాల పంపిణీతో పాటు వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊతకోలు మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థం ఇటువంటి కార్యక్రమం నిర్వహించినందుకు ప్రశాంత్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు అంకబాబు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివారాధనతో పాప పరిహారం

ఒంగోలు: శివారాధనతో సకల పాపాలు తొలగిపోయి సిరిసంపదలు లభించడమే కాకుండా ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని పురాణాలు తెలియజేస్తున్నాయని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక యిలింద్రవారివీధిలో వేంచేసియున్న శ్రీగంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామికి విశేష పూజలు, పుష్పాభిషేక కార్యక్రమం నిర్వహించారు. 16 రోజుల పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా పొన్నూరు వెంకట శ్రీనివాసులు శివలీలామృతం, శివతత్వం అనే అంశాలపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం పొన్నూరిని శ్రీశంకర బాలభక్త సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.